

ఆర్థిక సంవత్సరం చివరి రోజున...
కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -325 మంగళవారం 31 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ



**హైదరాబాద్ మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...**మిగతా 2లో...**

## 50 శాతం సీట్లు పెంపువెనక పెద్ద కుట్ర

- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ
- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



2లో.




## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

- 'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా
- 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ
- ఈసారి జనాభా లెక్కల్లో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల మార్పు

2లో.

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి

మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్,,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం **మిగతా 2లో...**




## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా



**పాట్నా,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు**మిగతా 2లో...**

## తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

- మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు
- విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న పీ4 కార్యక్రమం
- తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో వార్షికోత్సవం
- ఆకట్టుకున్న ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన
- మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో ముచ్చటించిన చంద్రబాబు



2లో.

## రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

- మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్
- ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి



2లో.

## నక్సలిజం దాదాపు అంతమైంది



- చర్చల ద్వారా సమస్యల పరిష్కారం
- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన

**న్యూఢిల్లీ,,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. **మిగతా 2లో...**

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



2లో.

- మంత్రి అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలి
- అక్రమ మైనింగ్, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు..సాక్ష్యాధారాలు అందజేత

## సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వడ్డీ రేట్లు యథాతథం



2లో.

# నక్సలిజం దాదాపు అంతమైంది

**మొదటిపేజీ తరువాయి**

మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం‘ అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. ‘నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. ‘రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 'ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు' జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎ÷-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం‘ అని హెచ్చరించారు.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**మొదటిపేజీ తరువాయి**

ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు.
ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ పథకాలకు భిన్నంగా, మానవతా దృక్పథంతో పేద కుటుంబాలను ఆదుకునే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ఈ వేడుకల్లో వివరించారు. ఈ కార్యక్రమంపై రూపొందించిన ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. పీ4 కార్యక్రమం ద్వారా గత ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10.39 లక్షల పేద కుటుంబాలను ‘మార్గదర్శులు‘ దత్తత తీసుకున్నట్లు ఏవీలో వెల్లడించారు. వీరిలో ఇప్పటికే 2.1 లక్షల కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురాగలిగామని తెలిపారు. సమాజంలోని ధనిక వర్గాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ‘మార్గదర్శులు‘గా వ్యవహరిస్తూ పేద కుటుంబాలను ‘బంగారు కుటుంబాలు‘గా దత్తత తీసుకుంటున్నారు. వారికి జీవనోపాధి మార్గాలు చూపడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ, పిల్లల చదువుకు చేయూత, గృహ నిర్మాణం వంటి అనేక రూపాల్లో సహాయం అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేడు లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాలు భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేవలం ప్రభుత్వ పథకాలతోనే కాకుండా, పౌర సమాజ భాగస్వామ్యంతో పేదలను పైకి తీసుకురావాలనే ఆలోచన అద్భుతమని పలువురు మార్గదర్శకులు ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త సామాజిక మార్పుకు నాంది పలుకుతోందని అభిప్రాయపడ్డారు.

# సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వడ్డీ రేట్లు యథాతథం

**న్యూఢిల్లీ,,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**




చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పథకాల వడ్డీ రేట్లలో వరుసగా ఎనిమిదోసారి ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి వర్తించిన వడ్డీ రేట్లు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు కొనసాగుతాయని ఆర్థిక శాఖ తెలిపింది. సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకం కింద చేసే డిపాజిట్లకు 8.2 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్లకు 7.1 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. పీపీఎఫ్‌కు 7.1 శాతం వడ్డీ రేటు వర్తిస్తుంది. పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లలో మార్పులేదు.
పోస్టాఫీస్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. కిసాన్ వికాస్ పత్ర పథకానికి 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకానికి 7.7 శాతం, పోస్టల్‌లో నెలవారీ ఆదాయ పథకంపై (ఎంఐఎస్) 7.4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం చివరిసారి 2023-24 నాలుగో

# దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

**న్యూఢిల్లీ,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**

భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై ‘కుటుంబం‘గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

**రెండు దశల్లో జనగణన:**

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో ‘గృహ గణన‘ చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు.
రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.
జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు. ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

**హైదరాబాద్‌మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది.
సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు. మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.
రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్‌ను రూట్ టు ఇన్‌కంగా ఆయన మార్చుకున్నారని వివరించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆయనకు తెలిసినంతగా ఈ దేశంలో మరెవరికీ తెలియవన్నారు. 14 అంశాలపై విచారణ చేయాలంటూ సీఎంకు లేఖ రాశామని గుర్తు చేశారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే పొంగులేటిని బర్తరఫ్ చేసి విచారణ జరపాలన్నారు. మంత్రిగా ఉన్నందున ఆయన విచారణను ప్రభావితం చేసే అవకాశముందని చెప్పారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంలో సాక్ష్యాధారాలను ఇచ్చినా బీజేపీ మౌనంగా ఉందనీ, ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పొంగులేటి అక్రమ మైనింగ్, భూకబ్జాలపైన త్వరలోనే మరింత కార్యాచరణ ప్రకటిస్తామని వివరించారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

**మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్**
**ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్**
**శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి**

**హైదరాబాద్,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులేటిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యులు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఒకరోజుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఇప్పటికే అసెంబ్లీలో కూడా బిఆర్ఎస్ సభ్యులను ఆదివారం సస్పెండ్ చేశారు. సోమవరంతో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి.

# 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర

**హైదరాబాద్,,మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు.ం

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త తెలుగు దిన పత్రిక..
మంగళవారం 31 మార్చి 2026

# పోరాట స్ఫూర్తికి ప్రతీకగా అరుణోదయ మహాసభలు

## ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఇట్టబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం అజయ్ ఎంపిక

**నర్సంపేట/ మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** దోపిడీ, అణచివేతలపై గళమెత్తిన ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన అరుణోదయ సంస్కృతిక సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా 7వ మహాసభలు నర్సంపేటలో ఉత్సాహభరితంగా జరిగాయి. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం వేదికగా నిర్వహించిన ఈ మహాసభల్లో పోరాట గీతాలు, జానపద కళారూపాలు సభా వాతావరణాన్ని ఉద్యమోద్బోధకంగా మలిచాయి.

సభ ప్రారంభానికి ముందు ఇట్టబోయిన రవి అరుణోదయ జెండాను ఆవిష్కరించి, పోరాట పంథాను కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అనంతరం జరిగిన సభలో యోచన, ప్రజాకవి వాగ్గేయకారుడు చిరంజీవి, ఇడంపాక శ్రీశైలం పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో ఏప్రిల్ 10, 11 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కామ్రేడ్ ఇట్టబోయిన రవి అధ్యక్షతన




జరిగిన సమావేశంలో గుర్రం అజయ్ తన ప్రసంగంలో అరుణోదయ ఉద్యమ చరిత్రను ఆవిష్కరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి, బండి యాదగిరి వంటి విప్లవ కవుల వారసత్వం, శ్రీకాకుళం పోరాట గీతాల ప్రభావంతో 1974లో ఆవిర్భవించిన అరుణోదయ, ఐదు దశాబ్దాలుగా ప్రజా




చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ, నృత్యరూపాల ద్వారా పల్లె ప్రజల జీవనాన్ని ప్రతిబింబిస్తూ, సారా వ్యసనం, కరువు, డ్రగ్స్, గంజాయి, వరకట్నం, మూఢనమ్మకాలపై నిరంతర పోరాటం సాగించిందని వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అరుణోదయ పాటలు తూటాల్లా మారి ప్రజలను ఉద్యమపథంలోకి నడిపించాయని పేర్కొన్నారు. గిరిజన, దళిత, ముస్లిం మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అరుణోదయ కళాకారులు తమ గళాన్ని ఆయుధంగా మలుచుకున్నారని, ఈ క్రమంలో అనేక మంది అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కానూరి వెంకటేశ్వర్లు, రామారావు, పల్స బిక్షం, ఏనుగుల వెంకన్న, కోడి శ్రీరాములు, సుబ్బారావు వంటి అమర కళాకారులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించిన నాయకులు, రాష్ట్ర స్థాయి 7వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ: ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఇట్టబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం అజయ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మహాసభల్లో సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అరెస్ట్ వారెంట్లతో ఉద్యమాన్ని ఆపలేరు

## తెగించి పోరాడి రాష్ట్రాన్ని సాధించాం - ఉద్యమకారుల రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్


**ఎల్కతుర్తి/మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** అరెస్ట్ వారెంట్లు జారీ చేసి ఉద్యమాలను అణిచివేయాలని ప్రయత్నించడం వ్యర్థమని తెలంగాణ ఉద్యమకారుల పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్ స్పష్టం చేశారు. సోమవారం ఉదయం స్థానిక పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్వంత పుచికపై విడుదల చేసి ఇంటికి పంపించారు. ఎల్కతుర్తి మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన నిమ్మల మనోహర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2001లో ప్రారంభమైన మలి దశ తెలంగాణ ఉద్యమంలో తాను కీలక పాత్ర పోషించానని, రాష్ట్ర సాధన కోసం అనేక అరెస్టులు ఎదుర్కొని జైళ్లలో



రోజులు గడిపానని తెలిపారు. అలాంటి ఉద్యమకారులపై ఈ విధంగా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వం పదేళ్లపాటు కుటుంబ పాలన కొనసాగించి ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అధికారంలోకి రాకముందు ఉద్యమకారులకు రెండు గుంటల ఇంటి స్థలం, రూ.25 వేల పింఛను వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు మాట మార్చడం బాధాకరమని అన్నారు. ఈ హామీల అమలుకోసం సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనబోతున్న నేపథ్యంలో ముందస్తుగా అరెస్ట్ చేయడం విచిత్రమని వ్యాఖ్యానించారు. ఉద్యమాలను అణచివేయడానికి చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించవని హెచ్చరించారు.

# అనుబంధాల ముసుగులో అదృశ్య సంకెళ్లు

## ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌పై అప్రమత్తత అవసరం



ప్రేమ, అనురాగం, బాధ్యత మానవ సంబంధాలకు పునాదులు ఇవే. కానీ, నేటి ఆధునిక కాలంలో ఈ సున్నితమైన భావోద్వేగాలనే ఆయుధాలుగా మలుచుకుని, అవతలి వ్యక్తిని మానసికంగా బందీలను చేసే ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ ఒక సామాజిక జాడ్యంగా మారుతోంది. మమకారం ముసుగులో సాగే ఈ మానసిక దాడి, వ్యక్తుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా, బంధాలను విషతుల్యం చేస్తోంది.

### ఏమిటీ ఈ భావోద్వేగ అరాచకం ?

ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ అనేది నేరుగా చేసే దాడి కాదు. ఇది అత్యంత నిగూఢంగా, సున్నితంగా సాగే ప్రక్రియ. మనకు అత్యంత సన్నిహితులు, మనం ఎవరినైతే ఎక్కువగా ప్రేమిస్తామో వారే ఈ బ్లాక్‌మెయిలర్లుగా మారడం ఇందులోని విషాదం. నువ్వు నా మాట వినకపోతే నేను ప్రాణాలు తీసుకుంటాను నా మీద నీకు ప్రేమ ఉంటే ఇలా చేయవు నీ వల్ల నేను ఎంత అనుభవిస్తున్నానో తెలుసా? ఇలాంటి మాటల వెనుక దాగి ఉన్నది ప్రేమ కాదు, అవతలి వ్యక్తిని తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలనే స్వార్థపూరిత కాంక్ష.

### బ్లాక్‌మెయిలర్ల వ్యూహాలు,భయం, బాధ్యత, అపరాధ భావం

ప్రముఖ మనస్తత్వవేత్తలు ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌ను FOG (Fear, Obligation, Guilt) అని పిలుస్తారు. తాము చెప్పినట్లు వినకపోతే బంధం తెగిపోతుందని లేదా ఏదైనా అనర్థం జరుగుతుందనే భయాన్ని కలిగించడం.

నీ కోసం నేను ఎంతో చేశాను, కాబట్టి నువ్వు నా మాట వినాల్సిందే అని కృతజ్ఞతా భావాన్ని బాధ్యతగా మార్చి ఒత్తిడి చేయడం.

ఎదుటి వ్యక్తిలో తప్పు చేశామనే భావనను కలిగించడం. తాము పడే బాధకు అవతలి వారే కారణమని నమ్మించడం.

### గుర్తించడం ఎలా?

ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ బారిన పడ్డవారు నిరంతరం మానసిక వేదనకు గురవుతుంటారు.

మీ నిర్ణయాలను మీ ఇష్టంతో కాకుండా, అవతలి వ్యక్తి కోపం వస్తుందనో లేక బాధపడతారనో తీసుకుంటున్నారా? మీరు ఎప్పుడూ క్షమాపణలు చెబుతూనే ఉంటున్నారా? మీ ఆత్మగౌరవం క్రమంగా తగ్గుతున్నట్లు అనిపిస్తోందా?

అయితే మీరు ఖచ్చితంగా ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు గురవుతున్నట్లే.

పరిష్కార మార్గం: లొంగిపోవడం కాదు, నిలబడడం. ఈ సమస్య నుంచి బయటపడటం అంటే బంధాలను తెంచుకోవడం అని కాదు, బంధాల్లో స్పష్టమైన సరిహద్దులు గీసుకోవడం.

మీ వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కడ ముగుస్తుందో, అవతలి వారి జోక్యం ఎక్కడ మొదలవుతుందో స్పష్టంగా చెప్పండి. మీరు ఎదుటివారి సంతోషానికి బాధ్యులు కావచ్చు, కానీ వారి ప్రవర్తనకు లేదా వారి మొండితనానికి మీరు బాధ్యులు కారు.

ఎవరైనా మిమ్మల్ని భావోద్వేగపరంగా ఒత్తిడి చేస్తున్నప్పుడు, వెంటనే స్పందించకండి. నేను ఆలోచించి చెబుతాను అని చెప్పడం అలవాటు చేసుకోండి. పరిస్థితి చేయి దాటిపోతుంటే నిపుణులైన కౌన్సెలర్లను సంప్రదించడం ఉత్తమం.

ఆరోగ్యకరమైన బంధం ఎప్పుడూ స్వేచ్ఛను ఇస్తుంది, ఊపిరి సలపని ఉచ్చులా మారదు. ప్రేమ పేరుతో సాగే అధికారాన్ని, బాధ్యత పేరుతో సాగే దోపిడీని గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస అవసరం. అనుబంధాలు ఆనందాన్ని ఇవ్వాలి, అశాంతికి వేదిక కాకూడదు. ఎమోషనల్ బ్లాక్‌మెయిలర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.



బిర్రు కరుణాకర్
జర్నలిస్ట్ వార్త సి ఈ ఓ సీనియర్ జర్నలిస్ట్

# క్వారీల నిర్లక్ష్యానికి చిన్నారులు బలి

## బాధిత కుటుంబాలకు రూ.2 కోట్లు, ఉద్యోగం ఇవ్వాలి



**సత్తుపల్లి/ మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో క్వారీలో పడి చిన్నారులు మృతి చెందిన ఘటనపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషాద ఘటనలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆయన, వారి పరిస్థితిని తెలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, చిన్నారుల మృతి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. గ్రామాల సమీపంలో అక్రమంగా క్వారీలకు అనుమతులు ఇచ్చి అమాయక చిన్నారుల ప్రాణాలను బలి తీసుకోవడం అనాగరికమని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబాలకు కనీసం రూ.2 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆధార్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుంగ హరికృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# నేడే తల్లాడ పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం

**తల్లాడ/మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రముఖ నిపుణులైన వైద్యులు హాజరై రోగులను పరీక్షించనున్నట్లు వెల్లడించారు. గైనకాలజీ సమస్యలు, కీళ్ల నొప్పులు, చిన్నపిల్లల వైద్య చికిత్స, సాధారణ వ్యాధులు, కంటి సమస్యలు, క్షయవ్యాధి లక్షణాల పరిశీలనతో పాటు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రత్యూష కోరారు.



# పిడుగుపాటుతో ఇల్లు దగ్ధం

## మనస్తాపంతో బక్కయ్య మృతి -కుటుంబానికి అండగా బంధువులు




**వైరా/మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని పుణ్యపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఖమ్మంపాటి చిన్న బక్కయ్య ఇంటిపై ఇటీవల పిడుగు పడటంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన బక్కయ్య సోమవారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే బంధువులు, కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఖమ్మంపాటి పెద్ద మల్లయ్య, ఖమ్మంపాటి కోటయ్య ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు కలిసి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో అందరూ ముందుకు వచ్చి సహాయం చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

# గ్రామ సిబ్బందికి నూతన డ్రెస్ కోడ్ పంపిణీ



**వేలేరు,/హనుమకొండ బ్యూరో మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన డ్రెస్ కోడ్ బట్టలను సోమవారం ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ మీ బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి డ్రెస్ కోడ్ బట్టలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలకు సేవలందించే సమయంలో ఒకే విధమైన డ్రెస్ కోడ్ ఉండటం వల్ల గుర్తింపు పెరగడమే కాకుండా క్రమశిక్షణ కూడా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమని, వారు మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, వార్డు సభ్యులు చైతన్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# ముచ్చారం గ్రామంలో శీలం కాశయ్యకు ఘన నివాళులు



**తల్లాడ/ మార్చి 30 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మండలంలోని ముచ్చారం గ్రామానికి చెందిన శీలం కాశయ్య ఇటీవల పరమపదించగా, ఆయన దశదినకర్మ కార్యక్రమం సోమవారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు అడపా అనిల్ చౌదరి హాజరై, కాశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన లాంటి వ్యక్తిని కోల్పోవడం గ్రామానికి తీరని లోటని అన్నారు. అనంతరం దుఃఖసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.
మరణించిన కాశయ్య కుమారుడు శీలం రాంబాబు నూతనకల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు తోట శ్రీకాంత్, నాగుల మేరా, వార్డు సభ్యుడు కోడూరు వీరబాబు ముదిరాజ్, ఇతర పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

## ఇస్మాయిల్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు.





**బయ్యారం/మార్చి 30.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో బిస్మిల్లా ట్రేడర్స్ ప్రొప్రైటర్ ఎస్ కే.ఇస్మాయిల్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకీ చెందిన వార్డు సభ్యులు చల్లా సురేష్,మూడు నాగమ్మ,మదన్, పసుపులేటి స్రవంతి,సతీష్,మాచర్ల లక్ష్మి,సుక్కయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెనుగొండ పుల్లయ్య, దనసరి భద్రయ్య,కొలిపాక రవి, జంపాల కుమార్(మాస్టర్)బానోతు రాజు,పుల్లూరి ప్రశాంత్, వెంకట్రావు, చల్లా రవి,పెనుగొండ నరేష్,అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పార్టీ అధ్యక్ష పదవికి 65 మంది దరఖాస్తు

**- పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ: కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు**

**- వర్ధన్నపేట మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణికి ఘన సన్మానం**



**ఐనవోలు/మార్చి 30(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆశావాహుల నుంచి భారీ స్థాయిలో స్పందన లభించింది. సోమవారం మండల కేంద్రంలోని మ్యాంగో రిసార్ట్‌లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి మొత్తం 65 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈనుగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో, మండల పరిశీలకులుగా వర్ధన్నపేట మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కుందూరు వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్రావు, నరసింహారెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్ష పదవి ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశానుసారం, జిల్లా అధ్యక్షులు ఈనుగాల వెంకట్రాంరెడ్డి సమక్షంలో సమర్థుడైన నాయకుడిని ఎంపిక చేస్తాం. పార్టీ కోసం కష్టపడి పనిచేసే తత్వం, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికే పదవి దక్కుతుంది అని వారు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేసిన పాలకుర్తి సారంగపాణికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఋగ్వేద్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మహేష్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్లు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, దేవాలయ డైరెక్టర్లు, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీఎం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



**చెన్నారావుపేట/మార్చి30(జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి సైకిల్‌పై నర్సంపేట వైపు వెళ్తుండగా, నెక్కొండ వైపు వెళ్తున్న వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సదరు వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వ్యక్తి అల్ట్రాటెక్ కంపెనీ టీషర్ట్ , దోవతి ధరించి ఉన్నారు. సుమారు 45 నుండి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉండవచ్చు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

# తెలంగాణ విద్యా విధానం 2026పై స్పష్టత ఇవ్వాలి: డిటీఎఫ్

**ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతానికి డిమాండ్ -ముల్కనూర్‌లో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**





అధ్యక్షులు
దాసరి రవీందర్



ప్రధాన కార్యదర్శి
నవీన్ కుమార్

**భీమదేవరపల్లి/మార్చి30 (జర్నలిస్ట్ వార్త):**
సోమవారం డిటిఎఫ్ భీమదేవరపల్లి మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు దాసరి రవీందర్ అధ్యక్షతన ముల్కనూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల నవీన్ కుమార్ సంఘం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విద్యా విధానం2026 పేరుతో ఇటీవల విడుదలైన తెలంగాణ విద్యా కమిషన్ నివేదికపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు మరియు నిపుణులతో చర్చించి ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకొని అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను తరగతి గదులకు దూరం చేసే విధంగా, వారి స్వేచ్ఛను హరించేలా చేపడుతున్న వివిధ కార్యక్రమాల వల్ల ప్రభుత్వ విద్యారంగం మరింత బలహీనపడుతుందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో బోధనేతర కార్యక్రమాలను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డోరి రమేష్, సీనియర్ నాయకులు ఎన్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు మరియు పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు సంబంధించిన వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల వారు తీవ్రమైన మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 01 జులై 2023 నుండి అమలులోకి వచ్చే విధంగా పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంలో 1.5 శాతం బేసిక్ పే చెల్లింపు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు భారమవుతుందని, ఆ వాటాను తగ్గించి పథకంలో చేరడాన్ని ఐచ్ఛికంగా చేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశం అనంతరం డిటిఎఫ్ భీమదేవరపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### మండల కార్యవర్గం:

అధ్యక్షులు దాసరి రవీందర్ (జెడ్పిహెచ్ఎస్ ముల్కనూర్)
ఉపాధ్యక్షులు వి. సతీష్ కుమార్ (ప్రాథమిక పాఠశాల మంగళంపల్లి), జె. స్వప్న (జి.ప.ఉ.పా. కొత్తకొండ), టి. సంపత్ (ప్రాథమిక పాఠశాల గట్ల నర్సింగాపూర్)
ప్రధాన కార్యదర్శి మాడుగుల నవీన్ కుమార్ (జి.ప.ఉ.పా. గట్లనర్సింగాపూర్)
కార్యదర్శులు టి. విజయ భాస్కర్ (ప్రాథమిక పాఠశాల కొత్తపల్లి), బి. ప్రేమ్ కుమార్ (ప్రాథమిక పాఠశాల ధర్మారం), కె. రాజ్ కుమార్ (ప్రాథమిక పాఠశాల వంగర), సి.హెచ్. కిరణ్ (జి.ప.ఉ.పా. కొత్తకొండ) జిల్లా కౌన్సిలర్లు ఎ. శ్రీనివాసరెడ్డి, వి. ప్రియదర్శిని, డోరి రమేష్, ఏ. వెంకటేశ్వర్లు, ఎన్. భాస్కర్ రెడ్డి, డా. ఎ. కిషన్, జి. రమణా రెడ్డి.
ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కే. శ్రీనివాస్, సభ్యులుగా పి. మహేందర్, ఆర్. శృతి ఎంపికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా బి. రాధిక, జె. రవీందర్ రెడ్డి ఉన్నారు.
ఈ కార్యవర్గ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా డోరి రమేష్, ఎన్నికల పరిశీలకులుగా ఎన్. భాస్కర్ రెడ్డిలు వ్యవహరించారు.

# ప్రజల రక్షణే ధ్యేయం

## వర్ధన్నపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**పోలీసు యంత్రాంగం ప్రత్యేక చొరవ.. సురక్షిత ప్రయాణంపై అవగాహన**









**వర్ధన్నపేట/మార్చి 30(జర్నలిస్ట్ వార్త):**
ప్రజల సేవలో పోలీసు శాఖ మరో ముందడుగు వేసింది. వరంగల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, వర్ధన్నపేట సహాయ పోలీసు కమిషనర్ (ఏసీపీ) అంబటి నర్సయ్య , పర్యవేక్షణలో సోమవారం వర్ధన్నపేట పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్‌లోని ప్రముఖ కాకతీయ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల బృందం సహకారంతో ఈ శిబిరం జరిగింది. స్థానిక పోలీసు అధికారి ఎస్సై ఎన్. సాయిబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాహన చోదకులు, యజమానులు, యువకులు, వృద్ధులు, గ్రామస్తులు పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ అంబటి నర్సయ్య మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను అరికట్టడంలో కంటి చూపు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యంగా వాహనాలు నడిపేవారు తమ కంటి ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలి. చూపు మందగించడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రతి వాహన చోదకుడు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు.
ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సి ఐ శ్రీనివాస్, ఎన్. సాయిబాబు, ఎం. రాజు పోలీసు సిబ్బంది పాల్గొని వైద్య బృందానికి పూర్తి సహకారం అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను దగ్గర చేయడమే కాకుండా, ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినందుకు స్థానికులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజల భద్రత కోసం పోలీసుల ప్రత్యేక చొరవ

**ప్రజా సేవలో పోలీస్ శాఖ మరో ముందడుగు -వర్ధన్నపేట లో ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరం**

**వర్ధన్నపేట మార్చి30 (జర్నలిస్ట్ వార్త):**
రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న »»ARRIVE ALIVE»» కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట లో ఉచిత కంటి చూపు వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. వరంగల్ జిల్లా CP సంప్రీత్ సింగ్ గారి ఆదేశాల మేరకు, ఐజూ రాజమహేంద్రనాయక్ గారి సూచనలతో, వర్ధన్నపేట ACP అంబటి నర్సయ్య గారి పర్యవేక్షణలో ాెూ చీ. సాయిబాబు గారి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది.
వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకతీయ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ వరంగల్ వైద్య నిపుణుల బృందం సహకారం తో. ఈ శిబిరంలో డ్రైవర్లు, వాహన యజమానులు,



యువత, వృద్ధులు, గ్రామస్తులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ACP అంబటి నర్సయ్య గారు CI శ్రీనివాస్ గారు SI N. సాయిబాబు వీ. రాజు లు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్లు కంటి ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు. సరైన చూపు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.
శిబిరం నిర్వహణలో పోలీస్ సిబ్బంది, వైద్య బృందం సమన్వయంతో సేవలు అందించగా, ప్రజలు పెద్ద ఎత్తున స్పందించడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.



మనిషి చరిత్రలో ఎన్నో సంక్షోభాలు వచ్చాయి. యుద్ధాలు వచ్చాయి. కరువులు వచ్చాయి. వ్యాధులు వచ్చాయి. కానీ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత మౌనమైన, అత్యంత విస్తృతమైన, అత్యంత ప్రమాదకరమైన సంక్షోభం పర్యావరణ సంక్షోభం.

ఇది ఒక్క దేశానిదీ కాదు, ఒక్క ప్రాంతానిదీ కాదు, ఒక్క తరానిదీ కాదు. ఇది మొత్తం మానవజాతి భవిష్యత్తును తాకే సంక్షోభం.

నేడు ప్రపంచం అభివృద్ధి, సాంకేతికత, పారిశ్రామికీకరణ, నగరీకరణ వైపు వేగంగా పరిగెడుతోంది. కానీ అదే వేగంతో ప్రకృతి తన సమతౌల్యాన్ని కోల్పోతోంది.

ఒకవైపు ఎత్తైన భవనాలు పెరుగుతుంటే, మరోవైపు చెట్లు కూలిపోతున్నాయి.

ఒకవైపు రహదారులు విస్తరిస్తుంటే, మరోవైపు చెరువులు మాయమవుతున్నాయి.

ఒకవైపు వినియోగ సంస్కృతి పెరుగుతుంటే, మరోవైపు నీరు, గాలి, నేల కలుషితమవుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో "ప్రమాదంలో పర్యావరణం" అనే భావన కేవలం ఒక నినాదం కాదు;

అది మన కాలపు అత్యవసర వాస్తవం.

ప్రకృతి సంక్షోభం అంటే మానవ సంక్షోభమే

పర్యావరణ సమస్యలను చాలా మంది ఇంకా ప్రకృతికే పరిమితమైన సమస్యలుగా భావిస్తున్నారు.

అడవులు తగ్గిపోవడం, నదులు ఎండిపోవడం, పక్షులు కనుమరుగవడం, కాలుష్యం పెరగడం ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన అంశాలే అనిపిస్తాయి.

కానీ అసలు విషయం అంతకంటే లోతైనది.

ప్రకృతి సంక్షోభం అంటే మానవ సంక్షోభమే.

మనిషి ప్రకృతికి వేరుగా ఉండే జీవి కాదు.

అతని శ్వాస గాలిపైనే ఆధారపడింది.

అతని ఆహారం నేలపైనే ఆధారపడింది.

అతని జీవనం నీటిపైనే ఆధారపడింది.

అతని ఆరోగ్యం వాతావరణ సమతౌల్యంపైనే ఆధారపడింది.

ఈ సహజ వనరులన్నీ దెబ్బతింటే, మనిషి నిర్మించిన నాగరికత ఎంత ఆధునికమైనదైనా నిలబడదు.

అందుకే పర్యావరణ సమస్యను "చెట్ల సమస్య"గా చూడటం ప్రమాదకరం.

అది మనుగడ సమస్య.

అభివృద్ధి పేరుతో ప్రకృతిపై దాడి

నేటి ప్రపంచంలో "అభివృద్ధి" అనే పదం అత్యంత ఆకర్షణీయంగా వినిపిస్తోంది.

పెద్ద రహదారులు, పారిశ్రామిక ప్రాజెక్టులు, మైనింగ్, రియల్ ఎస్టేట్, మెగా నిర్మాణాలు ఇవన్నీ అభివృద్ధి సూచికలుగా చూపబడుతున్నాయి.

కానీ ఒక కీలకమైన ప్రశ్నను మనం తప్పక అడగాలి:

ప్రకృతిని నాశనం చేస్తూ సాధించే అభివృద్ధి నిజంగా పురోగతేనా?

చెరువులను పూడ్చి భవనాలు కట్టడం,

కొండలను పేల్చి రాళ్లు తీయడం,

అడవులను నరికేసి కాంక్రీట్ అడవులు నిర్మించడం,

నదులను పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితం చేయడం

ఇవి అన్నీ అభివృద్ధి పేరుతో జరిగే ప్రకృతి దోపిడీ రూపాలే.

ఈ విధ్వంసం మూల్యం తక్షణం కనిపించకపోవచ్చు.

కానీ ప్రకృతి అప్పు ఎప్పటికైనా వసూలు చేస్తుంది.

అది వరదల రూపంలో రావచ్చు.

కరువుల రూపంలో రావచ్చు.

వేడి తరంగాల రూపంలో రావచ్చు.

ఆహార, నీటి సంక్షోభాల రూపంలో రావచ్చు.

అందుకే అభివృద్ధి అనే పేరుతో ప్రకృతిని తాకట్టు పెట్టే విధానాలను మళ్లీ సమీక్షించాల్సిన అవసరం ఉంది.

వాతావరణ మార్పు: ఇది రేపటి సమస్య కాదు, నేటి వాస్తవం

గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పు వంటి పదాలు ఒకప్పుడు శాస్త్రవేత్తల చర్చల్లో మాత్రమే వినిపించేవి.

ఇప్పుడు అవి మన దైనందిన జీవితంలో ప్రత్యక్ష అనుభవాలుగా మారాయి.

వేసవిలో తట్టుకోలేని ఉష్ణోగ్రతలు,

కాలానికి విరుద్ధంగా కురిసే వర్షాలు,

ఒక్కసారిగా ముంచెత్తే వరదలు,

రైతు జీవితాన్ని దెబ్బతీసే కరువులు,

తాగునీటి కొరత,

ఆరోగ్య సమస్యలు

ఇవి అన్నీ వాతావరణ సంక్షోభం మన గడప దాటిందని చెబుతున్నాయి.

ఇది ఇక భవిష్యత్తు తరాల సమస్య మాత్రమే కాదు.

ఇది ఇప్పుడే మన జీవితాలను ప్రభావితం చేస్తున్న సంక్షోభం.

పిల్లల భవిష్యత్తుపై పెద్దల నిర్లక్ష్యం

పర్యావరణ సంక్షోభం విషయంలో అత్యంత బాధాకరమైన అంశం ఏమిటంటే, దాని ఫలితాలను ఎక్కువగా అనుభవించాల్సి వచ్చేది ఇప్పటి పిల్లలకే, రేపటి తరాలకే.

మనము నేడు తీసుకునే ప్రతి తప్పు నిర్ణయం

అవసరానికి మించి వినియోగం,

నీటి వృథా,

ప్లాస్టిక్ అధిక వినియోగం,

చెట్ల నరికివేత,

భూమి కాలుష్యం

ఇవి అన్నీ రేపటి పిల్లల జీవన నాణ్యతను దెబ్బతీస్తాయి.

వారికి మనం ఏ భూమిని అందించబోతున్నాం?

శ్వాసించలేని గాలితో నిండిన ప్రపంచాన్నా?

తాగడానికి సురక్షితమైన నీరు దొరకని సమాజాన్నా?

పండని నేలతో, మండే ఉష్ణోగ్రతలతో కూడిన భవిష్యత్తునా?

అందుకే పర్యావరణ పరిరక్షణ కేవలం శాస్త్రీయ అంశం కాదు;

అది నైతిక బాధ్యత, సామాజిక న్యాయం, తరాల మధ్య ధర్మం.

గ్రామీణ జీవనంలో ఉన్న పర్యావరణ జ్ఞానం

మన సంప్రదాయ గ్రామీణ జీవన విధానాల్లో ప్రకృతితో సహజీవనం ఒక విలువగా ఉండేది.

చెరువులు, బావులు, వర్షాధార వ్యవసాయం, స్థానిక విత్తనాలు, చెట్ల పట్ల గౌరవం, పశుసంపద ఆధారిత జీవనం ఇవన్నీ ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడే జీవన పద్ధతులే.

కానీ ఆధునిక వినియోగ సంస్కృతి ఈ సహజ జీవనాన్ని బలహీనపరిచింది.

దీంతో మనం సౌకర్యాలను పెంచుకున్నా, స్థిరమైన జీవన పునాదులను కోల్పోతున్నాం.

ఇప్పటి సంక్షోభ సమయంలో గ్రామీణ జ్ఞానం, స్థానిక పరిజ్ఞానం, సంప్రదాయ జీవన విలువలను తిరిగి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్తు కోసం కొన్ని సమాధానాలు మన గతంలో కూడా ఉన్నాయనే విషయాన్ని మనం అంగీకరించాలి.

పర్యావరణ పరిరక్షణ ఒక కార్యక్రమం కాదు ఒక జీవనశైలి

పర్యావరణం గురించి మాట్లాడటం సులువు.

కానీ పర్యావరణాన్ని కాపాడే జీవనశైలిని అలవాటు చేసుకోవడం అత్యంత అవసరం.

చెట్లు నాటడం మంచిదే.

కానీ చెట్లు నరికివేతను ప్రశ్నించడం ఇంకా ముఖ్యమైనది.

నీటి సంరక్షణపై నినాదాలు అవసరమే.

కానీ నీటిని దుర్వినియోగం చేసే విధానాలను ఆపడం ఇంకా అవసరం.

ప్లాస్టిక్ తగ్గించమని చెప్పడం మంచిదే.

కానీ వినియోగ సంస్కృతినే పునర్విమర్శించడం మరింత అవసరం.

అందుకే పర్యావరణ పరిరక్షణను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా,

కుటుంబం నుంచి పాఠశాల వరకు, గ్రామం నుంచి నగరం వరకు, వ్యక్తి నుంచి ప్రభుత్వ విధానాల వరకు వ్యాపించే జీవన దృక్పథంగా మలచాలి.

పాఠశాలలు, ఉపాధ్యాయులు, యువత ముందుకు రావాలి

పర్యావరణ చైతన్యం సమాజంలో బలపడాలంటే పాఠశాలలు కీలక పాత్ర పోషించాలి.

పర్యావరణ విద్యను కేవలం పాఠ్యాంశంగా కాకుండా, అనుభవంగా, అలవాటుగా, బాధ్యతగా పిల్లల్లో నాటాలి.

పిల్లలు ప్రకృతిని చదవాలి మాత్రమే కాదు చూడాలి, తాకాలి, గమనించాలి, ప్రేమించాలి, కాపాడాలి.

ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజా సంఘాలు, స్థానిక సంస్థలు ఇవన్నీ కలిసివచ్చినప్పుడే పర్యావరణ ఉద్యమం బలపడుతుంది.

చెరువుల సంరక్షణ, చెట్ల పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, నీటి ఆదా, జీవ వైవిధ్య సంరక్షణ వంటి అంశాలు ప్రజల భాగస్వామ్యంతోనే ఫలితాలివ్వగలవు.

ఇప్పటికైనా మేల్కొనాలి

భూమి మనకు వచ్చిన వారసత్వం మాత్రమే కాదు;

మన తరువాతి తరాలకు అప్పగించాల్సిన జీవనాధారం.

అడవులు అంతరించిపోతే,

నీరు విషపూరితమైతే,

గాలి ఊపిరాడనివ్వకపోతే,

వాతావరణం మానవ జీవనానికి విరోధిగా మారితే

మనిషి సంపద, సాంకేతికత, అధికారాలు ఏవీ అతన్ని రక్షించలేవు.

అందుకే పర్యావరణ పరిరక్షణను ఇకపై ఒక "ఐచ్ఛిక అంశం"గా కాకుండా,

జీవన అత్యవసరంగా చూడాల్సిన సమయం వచ్చింది.

ముగింపు

ప్రమాదంలో ఉన్నది కేవలం పర్యావరణం మాత్రమే కాదు

మనిషి భవిష్యత్తు కూడా.

ప్రకృతిని కాపాడటం అంటే కేవలం చెట్లు, పక్షులు, నదులను కాపాడటం కాదు;

అది మన ఆరోగ్యాన్ని, మన ఆహార భద్రతను, మన పిల్లల భవిష్యత్తును, మన నాగరికత నిలకడను కాపాడటం.

ఇప్పటికైనా మనం మేల్కొనాలి.

లేకపోతే రేపటి తరాలు మన గురించి ఒకే మాట చెబుతాయి:

తెలుసుకుని కూడా భూమిని కాపాడని తరం

**- కె. బి. ధర్మ ప్రకాశ్**
**కన్వీనర్, పర్యావరణ ఉపసమితి**
**జన విజ్ఞాన వేదిక, తెలంగాణ**
**9989732423**

# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన




**వాషింగ్టన్,మార్చి30 (జర్నలిస్ట్ వార్త):** ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

## సింగరేణికి సమంబందించి పలు సూచనలు చేసిన కాగ్



**హైదరాబాద్‌మార్చి30 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్‌సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.


# నవనీత కృష్ణాలంకారంలో రాములవారు

## స్వామిని దర్శించుకుని పులకించిన భక్తులు -ఒంటిమిట్ట కళ్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూ



**ఒంటిమిట్ట,,మార్చి 30 (గుడివాడ మెయిల్):** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి,డిప్యూటీ ఈవో వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.

# ఆర్థిక సంవత్సరం చివరి రోజున... కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు



**అమరావతి,మార్చి30 (జర్నలిస్ట్ వార్త):**
ఈ ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజున భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీ కుప్పకూలాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,635.67 పాయింట్లు నష్టపోయి 71,947.55 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 488.20 పాయింట్లు పతనమై 22,331.40 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన 22,500 మద్దతు స్థాయిని కోల్పోవడం మార్కెట్‌లో మరింత బలహీనతకు సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. 22,500-22,600 స్థాయి నిఫ్టీకి తక్షణ నిరోధకంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు.

ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ మాత్రమే లాభపడగా.. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి షేర్లు భారీగా నష్టపోయాయి.

లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.68 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.66 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మిడిల్ ఈస్ట్‌లో ఇరాన్ దాడులు విస్తరించడం, ఘర్షణల్లోకి హౌతీలు ప్రవేశించడం, అమెరికా బలగాల మోహరింపు వంటి పరిణామాలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను పెంచాయని, దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లారని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు


## స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

**హైదరాబాద్,మార్చి30 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్స్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ఢమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

## 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ -నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు

### ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్



**అమరావతి,మార్చి30 (జర్నలిస్ట్ వార్త):**
ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.